కథలు :

# చమురు దొంగలు

చంద్రుడు

ఆ రోజు దీపావళి - అదొక పారిశ్రామిక పట్టణం. సాయంత్రం తొమ్మిది గంటలౌతోంది. దుకాణదారులంతా తమ తమ దుకాణాలను సీరిస్ బల్బులతో అలంకరించారు. దుకాణాల ముందు కర్రలు పాతి వేలాడి మట్టి ప్రమిదలను అలంకరించారు. ఆ ప్రమిదల చుట్టూ అడవిలోంచి తెచ్చిన పాలపొరుక కట్టారు. వాడలన్నీ పచ్చటి పాలపొరుకతో - దేదీప్యమానంగా వెలిగే దీపాల వరుసతో పట్టపగలులా తోస్తోంది.

చిన్న దుకాణదారులు టపాసులు, చిచ్చుబుడ్లు కాలుస్తున్నారు. పటాకుల మోత చెవులు చిల్లులు పడేవిధంగా విన్పిస్తోంది. తారాజువ్వలు పైకి దూసుకపోతున్నాయి. చిచ్చుబుడ్లు వెలుతురు చిమ్ముతున్నాయి.

చుట్టు ప్రక్క పారిశ్రామిక ప్రాంతాలనుండి, పల్లెలనుండి జనం ఈ సంరంభం చూడడానికి వచ్చారు. స్వీట్ హౌజ్‌ల్లో, పటాకాలు అమ్మే దుకాణాలల్లో జనం తోసుకుంటున్నారు. బ్రాంది షాపులు, బారులు కిటకిట లాడుతున్నాయి. పోలీసులు ట్రాఫిక్ కంట్రోల్ చేస్తూ, జనాన్ని కసురుతూ, తిడుతూ తిరుగుతున్నారు. ఈ జన సందోహంలో స్కూటర్ల, జీపుల హారన్ల చప్పుడు హోరెత్తుతోంది.

వాతావరణం మొత్తం గంధకం వాసనతో నిండిపోయింది. ఉండీ ఉండీ పెద్ద పెద్ద చప్పుళ్ళతో నగరం థనథన లాడిపోతోంది. వీధులనిండా పటాకాల కాగితాలు చెల్లాచెదురుగా పడుతున్నాయి.

జనం తమ దరిద్రపుగొట్టు బతుకులను కాసేపు మరిచిపోయి ఆ సంరంభమంతా తమదే అన్నట్లుగా తిరుగుతున్నారు. సిగల్లో, జడల్లో పువ్వులు తురుముకున్న పడుచు స్త్రీలు కిలకిల నవ్వుతున్నారు. తమ ప్రక్కనే పేలుతున్న బాంబులకు అదిరి పడుతున్నారు. వోరచూపులు చూస్తూ యువకులు పల్లె స్త్రీల వెంట పరాచికాలాడుతూ తిరుగుతున్నారు. కొత్త బట్టల పరపర - మొహాల మీద పులుముకున్న నవ్వులు నగరం సింగారించుకున్న యువతిలా ఉన్నది.

ఈ శబ్ద ప్రపంచంలో, ఈ జిలుగు వెలుగుల ప్రపంచంలో చౌరస్తా మీది ఓం ప్రకాశ్ అగర్వాల్ బిల్డింగ్ చుక్కల్లో చంద్రునిలా అలంకరించుకున్నది. ఆ

476

బంగ్లా కింద అన్ని రకాల షాపులున్నాయి. స్పేర్ పార్ట్స్ మొదలుకొని బట్టలు, జనరల్, బ్రాందిషాప్, ఎలక్ట్రానిక్స్, స్వీట్ హౌజ్ ఇట్లాగా ఆ కాంప్లెక్స్ మొత్తం ఒక కామధేనువు. అక్కడ అన్ని వస్తువులు దొరుకుతాయి. రెండవ అంతస్తుకు దాని వెనుక వేపు నుండి దారి ఉంది. అది ఒక పెద్ద అధునాతనమైన లాడ్జింగ్. దాని నానుకొని కింది భాగంలో పెద్ద నర్సింగ్ హోం. నర్సింగ్ హోమ్ ప్రక్క నుండి మూడో అంతస్తుకు దారి. మూడో అంతస్తు ఓం ప్రకాశ్ నివాసం.

ఓం ప్రకాశ్‌కు ఎన్ని రకాల వ్యాపారాలున్నాయో తెలియదు. అతనికి ఆరుగురు కొడుకులు. ఆరుగురు తలా ఇరువై రకాల వ్యాపారాలు చూస్తారు. హైద్రాబాద్‌లో హౌజింగ్ కాంప్లెక్స్ కట్టించి అమ్మడం దగ్గరి నుండి బీర్ బ్రేవరీస్ దాకా పెద్ద కొడుకు చూస్తాడు. ఈ బిల్డింగ్‌లోని దుకాణాలే కాక మట్కా జూదంతో సహా వడ్డీ వ్యాపారం అందరికన్నా చిన్నవాడు చూస్తాడు.

నిజానికి ఈ వ్యవహారాలన్నింటిలో ఓం ప్రకాశ్‌కు ఏ విధమైన పేచీలు లేవు. కాని ఓం ప్రకాశ్ స్వయంగా చూసుకునే వ్యవహారాలే ఈ మధ్య చిక్కుల్లో పడ్డాయి. అందులో ముఖ్యమైంది పేపరు మిల్లుకు వెదురు కలప సప్లయి చేయడం. ఈ వ్యవహారంలో యాభయి లారీలు నిర్విరామంగా తిరుగుతుంటాయి. ఆ యాభయి లారీలను చూడడానికి ఒక గ్యారేజీ అవసరమైంది. గ్యారేజీ తన లారీలకే అయితే సిబ్బందికి చేతినిండా పని ఉండదని జర్మనీ నుండి ఆధునిక యంత్రాలు దిగుమతి చేసుకుని అత్యంత ఆధునికమైన లారీ రిపేరింగ్ సెంటర్ నెలకొల్పాడు. దానితో పాటు పెట్రోలు బంకు వచ్చింది. ఎట్లాగూ అడవితో పని కనుక కర్రబొగ్గు తయారీ-కలప వ్యాపారం-వగైరా వగైరా చాలా వచ్చాయి. వెరసి ఈ తతంగ మంతటిలో కనీసం ఆరువందల మంది ఉద్యోగులొచ్చారు. వాళ్ళకు యూనియన్లు వచ్చాయి. గత ముప్పయి సంవత్సరాలుగా అసలు సిసలు సంస్థలను, ఆ సంస్థల యూనియన్లను మేనేజ్ చేస్తున్నాడు ఓం ప్రకాశ్ అగర్వాల్. ఓం ప్రకాశ్ సలహా సంప్రదింపుల మూలకంగానే అడవి ప్రాంతంలో అనేక పరిశ్రమలొచ్చాయనేది చాలా మందికి తెలియదు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేసే మిష మీద వచ్చాయన్నాయి.

ఈ చరిత్రంతా ఒకదానికొకటి అంకె వేసుకొని పెరిగింది. ఇప్పుడా ప్రాంతంలో సిమెంటు, బొగ్గు, కాగితం, బట్టలు, పైపులు, గూన కంపెనీలనేకం వచ్చాయి.... ఈ పరిశ్రమలన్నింటికి అగర్వాల్ అత్యంత ఆప్తుడు. అక్కడి నేల గురించి, దాని మట్టి గురించి, ముఖ్యంగా ఆ ప్రాంతంలో జనం గురించి అగర్వాల్‌కు చాలా విషయాలు తెలుసు.

ఇన్ని వ్యవహారాలు, పరిశ్రమల చరిత్ర సంక్షిప్తమైందీ కాదు, సరళమైంది కాదు. ఎక్కడో గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల సరిహద్దులు కలిపే చోటునుంచి ఓం ప్రకాశ్ అగర్వాల్ చిన్న ట్రంకు పెట్టెతో, పదివేల రూపాయలతో, ఇంకా సిగ్గు మొగ్గలు విడని భార్యతో మూడు రాత్రులు, మూడు పగళ్ళు ప్రయాణం చేసి వచ్చాడు. గుజరాత్ దాటుతూ ఉంటే భార్య ఏడ్చింది. భుసావల్ స్టేషన్లో రైలు పెట్టె దిగిపోయి తనింక దేశంకాని దేశం రానన్నది. అక్కడి నుంచి వార్ధా మీదుగా ఈ చిన్న పల్లెకు చేరుకునే సరికి ఓం ప్రకాశ్‌కు మొత్తం అడవిలాగే తోచింది. ఈ ఊరు ఢిల్లీ, మద్రాసును కలిపే బ్రాడ్‌గేజ్ రైల్వే లైను మీదుండడం ఓం ప్రకాశ్‌కు నచ్చింది. కిరాణ వర్తకుడుగా, వడ్డీ వ్యాపారస్తుడుగా జీవితం ప్రారంభించిన ఓం ప్రకాశ్ దారి తెన్నులేని అడివి గూడాలను కలెతిరిగాడు.... అట్లా తన వూరి వాళ్ళు, బంధువులు రావడం ఒక ధారలాగా ప్రారంభమయ్యింది. బట్టల మిల్లు వచ్చింది.... ఆ మిల్లు కోసం పత్తి పంట వచ్చింది. ఆ తరువాత దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. దేశానికి స్వాతంత్ర్యం రావడంతో అనేక పరిశ్రమలొచ్చాయి.

ఈ ప్రాంతంలో గిరిజనులు తిరగబడడం-జమీందారులకు, భూస్వాములకు, రైతులకు తగాదాలు జరగడం, ఒకరినొకరు చంపుకోవడాలు అనేకం అగర్వాల్ చూశాడు.... వాళ్ళట్లా తగవులాడటమే అగర్వాల్‌కు లాభించింది.... ప్రభుత్వాలు జోక్యం చేసుకొన్న ప్రతిసారి వందలు వేలమంది కొంపగోడు పోగొట్టుకొని పారిశ్రామిక ప్రాంతాలకు వలస వచ్చేవారు. దానితో అతనికి పనివాళ్ళు అతి చౌకగా దొరికేవారు. పైగా ఈ ఘర్షణల్లో అగర్వాల్ అదుకున్న వాడికింద లెక్క.

సోఫాలో నుండి ఉలిక్కిపడి లేచాడు అగర్వాల్- కుదిమట్టంగా, పొట్టిగా, ఎర్రగా ఉంటాడు అగర్వాల్- మూడో అంతస్తులోని కాన్ఫరెన్స్ హాల్ అందంగా అలంకరించి నిర్మానుష్యంగా ఉన్నది- వీధుల్లో టపాసుల మోత అదేపనిగా వినిపి

478

స్తోంది. ఆతని ఒంటిమీద పట్టులాల్చీ, ఆతని వేళ్ళకున్న వజ్రాలు పొదిగిన ఉంగరం ధగధగ లాడుతున్నాయి.... కాన్ఫరెన్స్ హాల్లో ఒంటరిగా నిలబడి మెత్తగా ఉన్న కార్పెటు మీద పచారు చేశాడు. అతని నుదురు ముడుతలు పడి ఉన్నది. అట్లా పచారుచేస్తూనే మూడో అంతస్తు బాల్కనీ గుండా వీధిలోకి చూశాడు. జనం గుంపులు గుంపులుగా తిరుగుతున్నారు. మధ్యలో సర్కిల్ ఇన్స్పెక్టరు జీపులో- పోలీసులు జనాన్ని తరుముతున్నారు తమ దుకాణంముందు లెక్కకుమించి దీపాల వరుసలు దీపాలల్లో దాదాపు ఇరువైమంది దాకా స్టీల్ బకెట్లల్లో నుండి నూనెతీసి పోస్తున్నారు- చిన్నవాడు శ్యామ్ బస్తాలకు బస్తాలు టపాసులు కుమ్మరించి, ఆ కుప్పలకు నిప్పు పెడుతున్నాడు....

ప్రపంచంలో ఉన్న శబ్దాలు, వెలుగు, సంపద, సంతోషం తన ఇంటి ముంగిటే ఉన్నా ఓం ప్రకాశ్ నుదురు ముడుతలు పడటానికి కారణమేమిటి ? తన వెనుక మెత్తటి అడుగుల చప్పుడు.

ఓం ప్రకాశ్ వెనుతిరిగి చూశాడు. పెద్ద కొడుకు నుదుటికి పెద్ద కుంకుం బొట్టుతో నిలుచున్నాడు....

"పితాజీ.... పూజ ప్రారంభమయ్యింది" అన్నాడు.

"కానియ్యమను, నాకు అర్జంటు పనున్నది" ఓం ప్రకాశ్.

పెద్ద కొడుకు వెనుకకు తిరిగాడు.

"చూడు రతన్ - అందరికీ ఫోన్లు చేశావా ?"

"చేశాను ...." అన్నాడు కొడుకు ....

కొడుకు వెళ్ళిపోయాడు.... "వీడిని ఇటుకేసి లాగాలి....కొత్త సిమెంటు కంపెనీ కన్‌స్ట్రక్షన్‌లో పెట్టాలి" అనుకున్నాడు. ఎందుకో మళ్ళీ మనసు లెక్కడో కలుక్కుమన్నది....ఆ 'కలుక్కుమన్న' విషయాన్ని మరిచిపోవడానికి మళ్ళీ కిందికి చూడసాగాడు.

జనం పల్చబడుతున్నారు. హఠాత్తుగా ఓంప్రకాశ్ కళ్ళు నిలబడిపోయాయి. దీపాలకై నీడల్లో నలుగురైదుగురు మనుషులు దొంగల్లా తచ్చాడుతుండడం చూశాయి....ఓంప్రకాశ్ అన్నీ మరిచి దృష్టి కేంద్రీకరించి వాళ్ళనే చూస్తున్నాడు.

వాళ్ళ....వాళ్ళకై నీడకుండి ఆరిపోయిన దీపపు ప్రమిదల నుండి మిగిలిన నూనెను ఎడంచేతుల్లో గల గిలేటు టిఫిన్లల్లో ఒంపుకుంటున్నారు.

479

ఓంప్రకాశ్ దిమ్మెరపోయారు. ఎవరూ వాళ్ళను చూడడంలేదు....బియ్యపు మిల్లులో హమాలి రాములు ఆ వరుస దీపాలలో నూనె పోస్తున్నాడు. వాడు వాళ్ళను గమనించాడా? ఆ అయిదుగురూ దూరంగా పోయి వెలుతురులో ఏమీ ఎరుగనట్లు నిలుచున్నారు. ఆ అయిదుగురిలో పడుచు స్త్రీ స్పష్టంగా కన్పిస్తోంది. వయస్సు దాదాపు 18 సంవత్సరాల కన్నా ఎక్కువుండదు. మాసిన వంకాయ రంగు చీర నడి కట్టేసి కట్టుకున్నది. ముఖం చూస్తే పచ్చి బాలింత లాగున్నది- ఆ బెదురు చూపులు ఎక్కడో చూసినట్లున్నది. ఎక్కడ ఎక్కడ? ఓంప్రకాశ్‌కు గుర్తుకు రావడంలేదు. ఊబ్బుల బనీనేసుకొని రాములు నూనె ప్రమిదల్లో నూనె పోసి వెనుదిరిగాడు. ఓంప్రకాశ్‌కు రాములును చూడగానే గుర్తొచ్చింది. సరిగ్గా పదిరోజులకింద రైసు మిల్లులో బియ్యం బస్తాల కిందపడి భీంగాడు చనిపోయాడు. వాడిది తిర్యాని దగ్గర ఏదో వూరు అని చెప్పి రాములుగాడే పనిలోకి తెచ్చాడు. భీంకు మొదట్లో 'గోండీ' తప్ప ఏదీరాదు. జంగ్లాతువాళ్ళు, పోలీసులు వాళ్ళ ఊరుమీద దాడిచేస్తే భయపడి ఇక్కడికొచ్చాడని చెప్పాడు రాములుగాడు.

అయితే చచ్చిన వాణ్ణి పంచనామా చేయించి ఖననం చేయించాడు- దాన్ని వెంటబెట్టుకొచ్చి తన కాళ్ళమీద పడేశారు హమాలీలు. దాని అర్థం తనకు తెలుసు. భీంగానికి కాంపెన్ సేషన్ కావాలి ... ఆ గొడవ సర్దడానికి తన పీకల మీదికొచ్చింది. మొదట ఏడుస్తూ తన కాళ్ళ మీద పడ్డ ఆపోరి, తను ఒక బియ్యం బస్తా ఇస్తా నననే చివ్వున లేచింది. "నీ మిల్లులు సత్తెనాశడం అయిపోతయి". అని పోయింది. ఆ ముఖం- ఓంప్రకాశ్ కింకా గుర్తున్నది.

మళ్ళీ నూనె దొంగలు కదిలారు. అందులో ఇద్దరు పోరగాండ్లు చీమిడి ముక్కులు- బాలింత ఆదర బాదరగా మట్టి ప్రమిదల్లోని వొత్తిని నొక్కి దీపాలు గిలేటు టిపిన్లో వొంపుకుంటోంది....

ఓంప్రకాశ్ తన యావదాస్తి దోచుకపోతున్నట్లుగా గింజుకున్నాడు.

అరె రాములుగాడు చూడనే చూశాడు....

"ఒరే రాములా! ఆ లం....ను తన్ను, మొత్తం నూనెగుంజుకో" ఓంప్రకాశ్ అనాలనుకున్నాడు, అరవాలనుకున్నాడు, గొంతు పెగలలేదు.

రాములుగాడు చడీచప్పుడు కాకుండా వచ్చాడు. ఆది బెదిరి కెవ్వున అరిచిందా? లేదు. తలవంచుకొని నిలుచున్నది, రాములుగాడు ఝాడిచ్చి దవడ మీద గుద్దడం-

వాడు దొంగలం....కొడుకు కడుపు దేవినట్లుగా నిజమన్నాడు. దొంగలాగా చూశాడు. బకెట్లోని నూనె దాని గిలేటు టిఫిన్ వొంచి చేతికిచ్చాడు మిగతా వాళ్ళు వాని దగ్గరకు పరుగెత్తుకొచ్చారు. రాములుగాడు గబగబా అందరి టిఫిన్లలల్లో నూనె వొంపి ఏమీ ఎరుగట్లు - దీపాలు సరిచేస్తున్నాడు. నూనె దొంగలు జనంలో కలిసి పోయారు. సర్కిల్ ఇన్స్పెక్టరు పోలీసులు, నౌఖర్లు, శ్యామ్‌గాడు చూస్తూండగానే నూనె దొంగలు వెళ్ళిపోయారు.

లాభంలేదు. ఈ పోలీసులు, తన కొడుకులు తన వ్యాపారాన్ని నిలబెట్టలేరు.

ఓంప్రకాశ్ మొత్తం యావదాస్తి పేకాటలో పోగొట్టుకున్నవాడిలాగా డీలా పడిపోయాడు. అడుగుల కింద మెత్తటి కార్పెటు గుచ్చుకుంటున్నట్లుగా ఉన్నది.

దాదాపుగా గత రెండు రోజులుగా అతని మెదడులో సుళ్ళు తిరుగుతున్న సమస్యకు లింకు ఎక్కడో బోధపడింది.

రెండు రోజుల క్రితం కూళ్ళు పెంచాలని అడవిలో వెదురు నింపిన తన అయిదు లారీలను కాలబెట్టిన వైనం గుర్తొచ్చింది. తన అయిదు లారీలు కాలి బూడిదైపోతుంటే డ్రైవర్లు, క్లీనర్స్ ఏమి చేశారో అర్థమయ్యింది.

గత యాభై సంవత్సరాలుగా జంషెడ్‌పూర్ స్టీల్ కంపెనీలో సమ్మెలెందుకు జరుగలేదో? ఆ కీలకం నల్లమందు వర్తకం చేసిన రక్తం అనుభవంలోనిదనుకున్నాడు. ప్లాసీ యుద్ధంలో పూల్ చంద్ ఇంగ్లీషు వాళ్ళకు ఎందుకు సపోర్టిచ్చాడో? భారతదేశంలోని పరిశ్రమల కీళ్ళు, పట్లు అన్నీ తెలిసిన ఓంప్రకాశ్‌కు చిరుచెమటలు పట్టాయి. ఈ జిల్లాలోనే ఓంప్రకాశ్ సలహా సంప్రదింపుల మీద అతని రక్త సంబంధీకులు అయిదు వందల కోట్ల పెట్టుబడులు పెట్టారు. అనేక ఘర్షణలు సునాయాసంగా పరిష్కరించుకున్నారు. ఓంప్రకాశ్ సలహా సంప్రదింపులతోనే ఆ పరిష్కారాలు జరిగాయి.

కాని....ఓంప్రకాశ్ తల తిరిగిపోతోంది. గుండెలో ఆయాసంగా తోచింది. శక్తి విహీనమైన చేతితో ఫోనెత్తి ఇంటర్‌కమ్‌లో పెద్దకొడుకును పిలిచాడు- నర్సింగ్ హోంలోని ఇద్దరు డాక్టర్లు ఆరుగురు కొడుకులు, కోడండ్లు, భార్యపైకి పరుగెత్తుకొచ్చారు.

డాక్టర్ బ్లడ్ ప్రెషర్ చూసి "ఫర్వాలేదు" అన్నాడు.

481

ఓంప్రకాశ్ కళ్ళు మూసుకున్నాడు. అతనికి ఆకుపచ్చ యూనిఫాంవేసుకున్న గిరిజనులు. వాళ్ళ చేతుల్లో తుపాకులు కనిపిస్తున్నాయి అ తుపాకులు తనకేసే గురి పెట్టబడి ఉన్నట్లుగా ఓంప్రకాశ్ గజగజలాడిపోయాడు.

ఓంప్రకాశ్‌కు దేశం నిండా అల్లుకున్న తనలాంటి బడా పెట్టుబడిదారుల అండదండలున్నాయి. కావాలంటే అతన్ని రక్షించడానికి ప్రభుత్వాలున్నాయి. దేశ విదేశాలతో లావాదేవీలున్నాయి....రాముడుకు భయపడ్డాడా? చనిపోయిన భీంభార్య బాలింతరాలుకు భయపడ్డాడా?.

ఓంప్రకాశ్ పదినిమిషాల తరువాత కళ్ళు విప్పాడు. తన ఎదురుగా ఆందోళనతో తనవాళ్ళు, బయటివాళ్ళు నిలుచున్నారు. వెనకనుండి ఎ. యస్. పి ఒగర్చుకుంటూ మెట్లెక్కి వచ్చాడు. అతని వెనకనే అదే వూరివాడైన పార్లమెంటు మెంబర్ వచ్చాడు.

వీధిలో పటాకాల చప్పుళ్ళు ఆగిపోయాయి.

ఓంప్రకాశ్ తాజా చిరునవ్వు ముఖం మీద పులుముకొని అందరికి సర్దిచెప్పి పంపేసరికి పదైంది.

తనొక్కడే సోఫాలో కూర్చుండి ఇందాకా తను చూసిన ఘటన జ్ఞాపకం తెచ్చుకున్నాడు. "అయితే మనుషులు ఒకరికొకరి దగ్గరౌతున్నారు. అది లెక్కలోకి తీసుకోవాలి.—" అనుకున్నాడు....

ఫోన్ ఎత్తబోతుండగానే సిమెంటు కంపెనీ ప్రసిడెంటు (జనరల్ మేనేజరు) గుప్తా వచ్చాడు....ఇంటిముందు కార్లు ఆగుతున్న ధ్వని....

"మిష్టర్ గుప్తా, చున్నీలాల్‌ను, కపాడియాను, రాజును కంటాక్టు చెయ్యి" అన్నాడు.

"దీపావళి కదా! కొంచెం లేటయ్యింది" అన్నాడు క్షమాపణలు చెప్పుకుంటున్నట్లుగా గుప్తా.

"ఇట్సీజ్ ఓకె - నౌ యుకెన్ ప్రొసీడ్-" ఓంప్రకాశ్.

గుప్తా ఫోనెత్తేలోగానే కపాడియా వచ్చాడు.

కపాడియా కాగితపు మిల్లు మేనేజరు.

కపాడియాను తన దగ్గరికి రమ్మన్నట్లు కళ్ళతోనే సైగచేశాడు ఓంప్రకాశ్.

గుప్తా ఫోనులో మాట్లాడుతుండగా....

482

"మొత్తం ఎంత నష్టం?" అడిగాడు.

"యాభయి లక్షలుండాలి" కపాడియా.

"ప్రెస్ మూడుకోట్లు రిపోర్టు చేసిందే?"

కపాడియా నవ్వాడు....ఆ నవ్వులోనే కపాడియా తన తెలివి ప్రదర్శించుకున్నాడు.

ఓంప్రకాశ్ చిరాకుగా చూశాడు....కపాడియా తెలివితేటలు ఓంప్రకాశ్‌కు తెలియనివి కావు. ఆ ప్రదర్శన సహించరానిది.

"నా ఉద్దేశ్యంలో ఏదో ఒక విధంగా సెటిల్ చేసుకుంటే" కపాడియా మాట పూర్తి కాకముందే ఏదో ఆలోచిస్తూ కళ్ళు మూసుకున్న ఓంప్రకాశ్ కళ్ళు తెరిచి.... "యూబాస్టర్డ్" అన్న చూపు చూశాడు.

ఆ వెనుకే సోఫాలోనుంచి లేస్తూ....ఏదో గొణిగాడు....

ఆ ప్రాంతంలోని పరిశ్రమాధిపతులంతా వచ్చి కూర్చుంటున్నారు. షేక్ హాండులు, చిరునవ్వులు.

ఓంప్రకాశ్ మూడో అంతస్తు బాల్కనీలో నిలుచున్నాడు. నగరం పొగ గొట్టాలతో పొగ చూరినట్లుగా ఉన్నది- వీధిలో జన సంచారం బొత్తిగా పల్చబడ్డది.

"వాళ్ళు దొంగతనంగానైనా నూనె సంపాదించి దీపాలు వెలిగించుకుంటున్నారు....వాళ్ళు ఒకరి నుండి ఒకరు ఏ రూపంలోనైనా నూనె అందించుకుంటుంటారు....ఇక్కడ వ్యవహారం "సెటిలైతే" ఏడుకోట్ల నుండి గిరిజనులు డిమాండు చేస్తారు....డబ్బు, తిండిగింజలు అవే అనుకుంటున్నాడు కపాడియా? కాని వాళ్ళు డిమాండు చేస్తున్నది అది కాదు ఆయుధాలు....అవి ఎక్కుపెట్టేదెవడి మీదికి"?

ఓంప్రకాశ్ నిశబ్దంగా, నిశ్చలంగా నిలుచున్నాడు....ఒంటరిగా....

అతని సహచరులు ఇంగ్లీషులో కేరింతలు కొడుతున్నారు.... "పెట్టుబడి పుట్టినది ఆదిగా అది అనేక యుద్ధాలు చేసింది. అనేక మార్లు అది తన రూపాన్ని మార్చుకున్నది. బహుశా ఈసారి జరుగబోయే యుద్ధం అత్యంత సంక్లిష్టమైంది. తీవ్రమైందికూడా" మనసులో అనుకుంటూ ఓంప్రకాశ్ దీర్ఘంగా నిట్టూర్చి తన సహచరుల మధ్యకు నడిచాడు.

483